# కలికాలం సీత

## -డా.తంగిరాల మీరా సుబ్రహ్మణ్యం

మానేజరు గదినుండి విసురుగా బయటకు వచ్చింది శోభన. ఆమె రోష కషాయిత నేత్రాలనుండి రాలిపడడానికి సిద్ధంగా వున్నాయి కన్నీళ్ళు. నలుగురి ముందు తన బలహీనత బయటపడ కూడదన్నట్టు తనని తాను కంట్రోల్ చేసుకుంటూ ఎవరివైపూ చూడకుండా తనసీటు దగ్గరకు వచ్చి కుర్చీలో కూర్చుంది. ఆమె గుండె అవమానంతో, కోపంతో మండిపోతోంది. పర్సులో నుండి రుమాలు తీసుకుని చెమట అద్దుకుంటున్నట్టుగా ముఖం తుడుచుకుని కంటి తడిని కూడా కర్చీఫ్‌లో దాచేసింది.

'ఆడది అందంగా వుండడం ఒక శాపమైపోయింది. అసలు ఆడదానిగా పుట్టడమే శిక్ష. దానికితోడు వాడిపోని యవ్వనం, తోడు లేని ఒంటరి జీవితం జతపడితే బ్రతుకు నరకంకన్నా దుర్భరం. ఈ దౌర్భాగ్యాన్ని మూటకట్టుకున్న నాలాంటి వాళ్లకు చావే గతి'

"ఏమైంది శోభనా" అని ఆదరంగా అడిగిన వినీల దగ్గర తన ఆవేదన అంతా వెళ్ళగక్కింది శోభన.

"క్యాంటీన్‌కి వెళ్ళి కాఫీ త్రాగి వద్దాం పద" అంటూ శోభన ముందున్న ఫైలు మూసిపెట్టి, ఆమె పర్సు తన చేతిలోకి తీసుకుని కుర్చీలోంచి లేచింది వినీల.

అప్పుడే ఒకరిద్దరు సహోద్యోగులు తమ వైపు అదోలా చూస్తుండడం గమనించిన శోభన మారు మాట్లాడకుండా మౌనంగా వినీల ననుసరించింది.

"ముందు కాఫీ తాగు..తర్వాత మాట్లాడు కుందాం" సర్వర్ తెచ్చి పెట్టిన కాఫీ కప్పు శోభన కందించింది వినీల.

తను మరో కప్పు అందుకుని సిప్ చేసింది వినీల.

శోభన కుడిచేతితో పట్టుకున్న కప్పుపట్టు దప్పి వేడిగా మర్లుతున్న కాఫీ ఆమె ఎడమ ముంజేతి మీద పడింది.

"అబ్బా!" అని కూడా అనకుండా నిశ్శబ్దంగా ఖాళీ కప్పుబల్లమీద పెట్టి పెదవులు బిగించి చేతికేసి చూసుకుంటోంది శోభన. ముంజేయి ఎర్రగా కందిపోయింది.

గభాలున తన చేతిలోని కాఫీ కప్పు బల్లమీద పెట్టేసి పక్కన గ్లాసులో వున్న చల్లనీరు శోభన చేతిమీద పోసి "ఒకవేళ అతను చెయ్యి పట్టుకున్నంత మాత్రాన నువ్వు నీ చేతిని కాల్చుకోనవసరం లేదు శోభనా" లోగొంతుకతో అంటూ తన రుమాలు నీటిలో తడిపి ఆమె చేతికి చుట్టింది వినీల.

"ఇన్నాళ్ళూ వెకిలి మాటలు, వెకిలి చూపులే వుండేవి. మగదిక్కులేని ఆడది ఏం చేయగలదు అనుకున్నాడేమో! ఇవాళ హఠాత్తుగా చేయిపట్టుకున్నాడు 'మా మిసెస్ ఊరెళ్ళింది. ఇంట్లో ఎవరూ లేరు. సాయంత్రం మా ఇంటికొచ్చి ఒక్కగంట గడిపేవంటే నీ ప్రమోషను వచ్చేసినట్టే' అన్నాడు.

పేపర్ వెయిట్‌తో అతని ముఖం పచ్చడి చేద్దామా అనుకున్నాను గానీ రచ్చచేయడం వలన అవమానపడేది నేనే అనిపించి జవాబివ్వకుండా వచ్చేసాను" దుఃఖాన్ని నొక్కిపెడుతూ చెప్పింది శోభన.

నలభై ఏళ్ళ వయసులో కూడా యవ్వనపు మిసమిసలు శోభన ఒంటిని అంటిపెట్టుకునే వున్నాయి. అందంగా, సుకుమారంగా కనబడే శోభనకు పదహారేళ్ళ కూతురు వుందంటే ఎవ్వరూ నమ్మరు.

ఆమెది ప్రేమ వివాహం. పెద్దవాళ్ళ వ్యతిరేకత తను లక్ష్యపెట్టకుండా తను ప్రేమించిన రవిని పెళ్ళాడింది. పిల్లలమీద మమకారంకన్నా కుటుంబం పరువు ప్రతిష్టలే ముఖ్యమనుకున్న వాళ్ళ తల్లిదండ్రులు శోభన రవిలను శత్రువులుగా భావించి సంబంధ బాంధవ్యాలు త్రెంచుకున్నారు.

తన ప్రేమానురాగాలతో ఆమె కన్నవారికి దూరమైందన్న చింతను మరపించాడు రవి. శోభన కూతురు సౌమ్య అచ్చం తల్లి పోలిక. పదవ తరగతిలో రాష్ట్రస్థాయిలో ప్రతిభ చూపి పాసయింది.


ఆనందంగా సాగిపోతున్న శోభన జీవితం రవి హఠాన్మరణంతో చీకటైపోయింది. ఈ విషాదం జరిగి ఇంకా ఆరునెలలైనా కాలేదు. గత మూడు నెలలుగా మానేజరు తనతో ప్రవర్తిస్తున్న తీరు శోభనకు తలనొప్పిగా తయారయింది.

సాయంత్రం ఇంటికి బయల్దేరే సమయానికి పిలిచి ఏదో ఒక పని అప్పచెప్తున్నాడు. "ఒక్కదానివే కదా వుండేది..కూతుర్ని కూడా హాస్టల్లో చేర్పించావు. ఇంటికి వెళ్ళి చేసేదేముంది? నేను నీకు తోడుగా వుంటాలే.." అంటున్నాడు.

ఆమె నడుము ఒంపుగురించీ, మెడ నునుపు గురించీ, శరీర పరిమళం గురించీ మెచ్చుకుంటాడు. చూపులతో తడుముతాడు.

ఈరోజు అతని ప్రవర్తన మితిమీరి పోవడంతో శోభన మనసు దుఃఖోద్వేగంతో ఎగసిపడుతున్నది.

"సెక్స్యువల్‌గా హెరాస్ చేస్తున్నాడని అతని మీద ఫిర్యాదు చేయడమొక్కటే మార్గం" అంది వినీల.



"దానికన్న ఆత్మహత్య చేసుకుని చావడం మంచిది. నా గురించి నలుగురూ నానా మాటలు అనడం, ఎంక్వైరీలు ఇవన్నీ సౌమ్య భవిష్యత్తును నాశనం చేస్తాయి. అసలు ఈ విషయం సౌమ్యకు తెలిస్తే తట్టుకోగలదా? నా గురించి కూడా అపోహలు కలిగితే నా గతేమిటి?" నిస్పృహగా అన్న శోభన.

"శత్రువు బలాన్ని తాను గ్రహించి వాలి మరింత రెచ్చిపోయినట్టు నీ బలహీనత నుండి అతను బలం పుంజుకుంటున్నాడు" హెచ్చరిస్తున్నట్టుగా అంది వినీల.

"దీపం చుట్టూ తిరిగే శలభంలా నీ చుట్టూ మూడు నెలలుగా తిరుగుతున్నాను. ఎన్నాళ్ళు నీ బెట్టు? ఏం రవి కన్నా ఏ రకంగా తీసిపోయాను?" అంటూ నా భర్తతో పోల్చుకున్నాడు. ఇలాంటి రావణాసురుల నుండి ఏ కాలంలోనూ స్త్రీలకు రక్షణ లేదా?" వణుకుతున్న కంఠస్వరంతో అన్నది శోభన.

"గరుత్మంతుడు సర్పమును హరించునట్లు నీవు నా మనస్సును హరించుచున్నావు" అని సీతతో అంటాడు రావణుడు. గరుత్మంతుని చేత హరింపబడిన సర్పమునకు చావే గతి. రావణాసురునికి కూడా అదే గతి పట్టబోతున్నదని విశిష్టమైన ఈ ఉపమానంలో వాల్మీకి సూచించారు. మన బాస్ కూడా దీపం చుట్టూ శలభంలా తిరుగుతున్నానని మంచి పోలిక వాడుకున్నాడు. ఆ శలభానికి పట్టిన గతి వాడికీ పట్టగలదు" కసిగా అంది వినీల.

"ఏం చేయాలో తెలియక నేను ఏడుస్తుంటే నువ్వు సాహిత్య చర్చలోకి దిగుతున్నావా? ఇదేనా నువ్వు చేసే ఉపకారం?" ఉక్రోషంగా అంది శోభన.

"నూరు తప్పులు చేసేవరకు శిశుపాలుడిని శిక్షించలేదు కృష్ణుడు. దుష్టశిక్షణ కోసం సుగ్రీవుడు రాముడి సహాయం తీసుకున్నట్టు..." అంటూ వినీల చెప్తుంటే కోపంగా లేచి విస విస ఆఫీసులోకి వెళ్ళిపోయింది శోభన.

***

"నా సీట్లో పని చాలా ఎక్కువగా వుంటోంది సర్. అది చాలక ఎవరు సెలవు పెట్టినా ఎక్స్ట్రా పని నా మీద వేస్తున్నారు. ఇది అన్యాయం" మేనేజరు దగ్గరికి వెళ్ళి ఫిర్యాదు చేసింది వినీల ఒక రోజు.

ఆమె వైపు వెటకారంగా చూసాడు రమణారావు.

"మీ సీట్లో నిజానికి పని ఎక్కువగా వుండదు. అందుకే పెండింగు వర్క్ వుంటే మీకు ఇవ్వడం జరుగుతోంది. ఆ

కాస్త పనీ చేయలేనంత సుకుమారి నంటారు మీరు?'' ఆమెను నఖశిఖ పర్యంతం చూపులతోనే తడిమేస్తూ, నిండుగా వున్న అందాలను పరీక్షిస్తూ వ్యంగ్యంగా అడిగాడు.

"అంటే నేను లావుగా వున్నానని గుర్తుచేస్తున్నారా?'' నొచ్చుకుంటున్నట్టుగా అడిగింది వినీల.

"అయ్యో! నా ఉద్దేశమది కాదు. మీరు లావని ఎవ్వరైనా అంటారా? కాస్త బొద్దుగా వున్నారంతే. మీకో విషయం తెలుసా. అసలు ఆడవాళ్ళు కాస్త బొద్దుగా వుంటేనే బాగుంటారు. అప్పుడే ఒంపూ సొంపూ కంటికి నిండుగా కనబడతాయి'' వెకిలిగా నవ్వి ఆమె నిండైన గుండె వైపు చూస్తూ అన్నాడతను.

"సర్! మీరు ఇష్టమొచ్చినట్టు మాట్లాడుతున్నారు. నన్ను చాలా అవమానిస్తున్నారు. అనవసరమైన చనువు తీసుకుంటున్నారు. నన్ను మీరు సెక్స్యువల్‌గా హెరాస్ చేస్తున్నారు'' రోషంగా అంటూ లేచి నిలబడింది వినీల.

"మీ గురించి మీరు గొప్పగా ఊహించుకుంటున్నారు వినీలా! మీవంటి అందగత్తె దొరకదనా? మిమ్మల్ని లైంగికంగా వేధించే అంత దిగజారను'' అన్నాడు రమణారావు కాస్త ఎగతాళిగా.

"మీరు నా రూపాన్ని వెక్కిరించడమే కాకుండా నా కులాన్ని గురించి నీచమైనదని కించపరిచారు. ఇక ఎట్టి పరిస్థితుల్లోనూ ఊరుకోను మీమీద నేను ఫిర్యాదు చేస్తాను'' విసురుగా అని దూకుడుగా గది నుండి బయటకు వచ్చింది వినీల.

గుమ్మం దాటి బయట పడ్డాక ఇంకా గొంతు పెంచి "మీరు ఎన్ని మాటలన్నా, ఎంతగా అవమానించినా నోరెత్తకుండా పడివుంటాననుకోకండి. మీ ప్రవర్తనకు జవాబు చెప్పుకోవలసి వుంటుంది తొందరలోనే!'' అని అందరికీ వినబడేలా గట్టిగా, ఆవేశంగా అరచి చెప్పి విస విస నడుస్తూ తన సీటు దగ్గరికి వెళ్ళింది.

ఫైళ్ళన్నీ మూసేసి, పర్సు తీసుకుని బయటపడింది వినీల అదే విసురుతో.

ఏం జరిగిందో అర్థంకాక శోభన తనుకూడా సీటు వద్దనుండి లేచింది. ఆఫీసులో మిగిలినవారు తలోరకంగా మాట్లాడ్డం మొదలుపెట్టారు.

"ఇలాంటి మానేజర్లు వుంటే పెళ్ళి అయిన ఆడవాళ్ళూ, పెళ్ళికాని వాళ్ళూ ఉద్యోగాలు మానుకోవలసిందే'' అని ఆడవాళ్ళు గుసగుసలు పోయారు.

"చేతికందిన పిల్లలుండి, ఈ వయసులో ఈయనకు ఇదేం బుద్ధి? అందంగా వున్నాను, పైగా ఆఫీసుకు మహారాజును అనుకుని అందరిమీదా కన్నేస్తే ఎవరో ఒకరు తిరగబడకపోరు'' మగవాళ్ళు గొణిగారు.

★★★

వినీల ఇచ్చిన ఫిర్యాదు వలన పది రోజుల్లో ఎంక్వైరీ కమిటీ ఆఫీసుకు వచ్చింది.

స్టాఫ్‌ని ఒకరొకర్ని పిలిచి రమణారావు గురించి విచారించడం జరిగింది.

బాస్ ప్రవర్తనను, మాటల్ని వినీల తన సెల్‌ఫోన్లో రికార్డ్ చేసి పై అధికారులకు అందజేసిందన్న విషయం రమణారావుకి తెలియని విషయం.

ఆ నెలాఖరుకి రమణారావుకి సస్పెన్షన్ ఆర్డర్స్ అందాయి.


"నీలాంటివాళ్ళు నూటికి ఒకరుంటే ఉద్యోగం చేసే ఆడవాళ్ళపట్ల మరి కాస్త జాగ్రత్తగా మసలుతారు వారి సహోద్యోగులు, అధికారులు కూడా. అతను నిన్ను హెరాస్ చేస్తున్నట్టు నాతో ఎప్పుడూ అనలేదు నువ్వు..ఒక్కసారి తోకత్రొక్కితే కత్తిరించేసావా?'' వినీలను అభినందిస్తూ అన్నది శోభన.

"పరువు పోతుందనీ, నలుగురిలో చులకన అవుతామనీ, లేక మనవాళ్ళతో సంబంధ బాంధవ్యాలు దెబ్బతింటాయనీ ఏదో ఒక కారణంతో ఆడవాళ్ళు ఎదిరించకపోబట్టే రమణారావు వంటివాళ్ళు ఇష్టమొచ్చినట్లు చెలరేగుతున్నారు. వీళ్ళు రక్తబీజుడి వంటివాళ్ళు, ఒకడుపోతే మరొకడు పుట్టుకొస్తాడు. శక్తికొలదీ పోరాడ్డమేకాదు కాళికలా ఉపాయమూ వన్నా'' అన్నది వినీల.

"ఇంతకీ నువ్వు సీతవా ఛాయా సీతవా?'' అనడిగిన శోభనకు

"నేను ఈ కాలం సీతను. ఎవరో వచ్చి రక్షిస్తారని ఎదురుచూడకుండా నన్ను నేను రక్షించుకుంటాను'' అని జవాబిచ్చింది వినీల.

★



## కెరీర్ మీదే దృష్టి

అందరూ అనుకున్నట్టుగానే ముగిసింది కంగనా-అధ్యయన్‌ల ప్రేమ కథ. వయసులో తనకంటే చిన్నవాడైనప్పటికీ అతనితో చెట్టాపట్టాలేసుకుని తిరిగిన కంగనా ఇప్పుడు 'అవును, అధ్యయన్‌కి తన సమస్యలేవో తనకి వున్నాయి. అలాగే నా ప్రాబ్లెమ్స్ నావి. అందుకని ఇద్దరం మా ప్రేమకి ఫుల్‌స్టాప్ పెట్టేస్తూ కెరీర్‌వైపు దృష్టి పెడుతున్నాం' అంటూ చిలకపలుకులు పలికింది. దాదాపు అవే మాటలు చెప్పేసాడు అధ్యయన్. ఏదయితేనేం కొంత కాలం పాటు వార్తల్లో వెలిగారు కదా ఇద్దరూ.

